మాఘ అమావాస్య జాతరకు ఏర్పాట్లు

• జిల్లాలో ముస్తాబైన ఆలయాలు • సిరిసిల్లలో మాఘ అమావాస్య ప్రత్యేకం • మానేరు తీరాన ఒక్కరోజే మూడు జాతరలు • తరలిరానున్న వేలాదిమంది భక్తులు



జాతరకు ముస్తాబైన గంగాభవాని ఆలయం

మాఘ అమావాస్య జాతరకు జిల్లాలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. మాఘ అమావాస్య రోజు జిల్లాలోని చాలా గ్రామాల్లో గ్రామ దేవతలకు తిరునాళ్ల (జాతరలు) నిర్వహించడం పరిపాటి. కానీ సిరిసిల్లలో మాత్రం ఒకే రోజు మూడు జాతరలు జరగడం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఈ మాసంలో శుభ దినాలు ఎక్కువ ఉండటంతో ఏటా మాఘ అమావాస్య రోజు గంగాభవాని, మడేలేశ్వరస్వామి, రామలింగేశ్వరుల తిరునాళ్ల(జాతరలు) జరుగుతాయి. మూడు జాతరలకు ముస్తాబైన మానేరు తీరంతో పాటు పలు ఆలయాల్లో ఏర్పాట్లపై ప్రత్యేక కథనం..

సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని మానేరు తీరంలో మాఘ అమావాస్య రోజు తిరునాళ్ల జరగడం పూర్వకాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. పట్టణాన్ని ఆనుకొని ప్రవహించే మానేరు నదిలోని గంగమ్మ ఆలయంలో గంగపుత్రులు, పట్టణ శివారులోని రామప్ప (ప్రస్తుతం మిడ్‌మానేరు ముంపులో ఉంది) ఆలయంలో నాయీ బ్రాహ్మణులు, మానేరు తీరాన వెలసిన మడేలేశ్వర ఆలయంలో రజకులు ఆయా దేవతా మూర్తుల కల్యాణోత్సవాలు జరిపి జాతరలు నిర్వహిస్తారు. ఈ జాతరకు పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొంటారు. దీంతో మానేరు తీరంలోని మూడు ఆలయాలకు పండుగ శోభ వచ్చింది. శుక్రవారం జరిగే ఉత్సవాలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి.

ఆలయాల ప్రాశస్త్యం ఇదీ..

అమావాస్య నుంచి ఈమాసం ప్రారంభంకావడంతో జిల్లాలోని పలు ఆలయాల్లో ఆయా దేవతల కల్యాణాలు నిర్వహించడం ఆనవాయితీ. పట్టణ శివారు గుట్టల్లో ప్రాచీన ఆలయంగా వెలుగొందుతున్న రామప్ప గుడిలో రామలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకలను నాయీబ్రాహ్మణ సంఘం అనాదిగా చేపడుతుంది. అటవీ ప్రాంతంలో వెలసిన ఈ ఆలయం కాకతీయుల పాలనకు ముందే నిర్మాణం చరిత్రలో నిలవడం ప్రత్యేకత. నట్టడవి అందులో కొండలు, నదీ తీరాన జాతర జరగడం వేలాదిగా భక్తులు తరలిరావడం ఇక్కడి ప్రత్యేకత. ప్రస్తుతం ఈ ఆలయం మిడ్‌మానేరు ముంపు జలాల్లో ఉండటంతో సమీప ప్రాంతంలో ప్రభుత్వ కేటాయించిన ఆలయ స్థలంలో వేదిక ఏర్పాటు చేసి ఉత్సవాలు జరుపుతున్నారు. చాలా గ్రామాల్లో గంగాభవాని కల్యాణాన్ని ప్రతిమూడు, ఐదేళ్లకోసారి జరుపుతారని ప్రతీతి. సిరిసిల్లలోనే ఏటా గంగపుత్రులు అమ్మవారి వివాహ వేడుక జరిపించడం తరతరాలుగా ఆచారం ఉంది. మానేరు నది మధ్య జరిగే వేడుకలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. సిరిసిల్ల మానేరు నది ఒడ్డున రజకసంఘం ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల క్రితం కులదైవం మడేలేశ్వరుడి ఆలయాన్ని నిర్మించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈఏడు జాతర నిర్వహణకు ఆలయ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేసింది.



ముస్తాబవుతున్న మడేలేశ్వర స్వామి ఆలయం

మామిడిపల్లి ఆలయం ముస్తాబు



మామిడిపల్లిలోని సీతారామ చంద్రస్వామి ఆలయం



ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కోనరావుపేట: మాఘమాస్య జాతరకు మండలంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం నుంచి జరుగనున్న జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

మామిడిపల్లిలోని శ్రీ తారామచంద్రస్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. పూర్వకాలంలో మహామునిపల్లెగా పిలిచే ఈ ప్రాంతంలో మునులు తపస్సు చేసేవారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. మహామునిపల్లెగా పిలవబడే ఈ ప్రాంతం కాలక్రమేణ మామిడిపల్లిగా పిలుస్తున్నారు. ఆ లయంలోని పురాతన బావిలో కొన్నేళ్ల క్రితం క రువు సమయంలో కూడా నీరు ఉబికివచ్చింది. ఆ నీరు ఇప్పటికీ అలాగే ఉండటంతో దేవుని మహిమగా భావిస్తూ పూజలు చేస్తున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

ఆలయంలో మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కోనరావుపేట, వేములవాడ, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లా బీంగల్, సిరికొండ, తదితర ప్రాంతాల నుంచి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. జాతర సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా ట్రాక్టర్లతో చదును చేయించి నీళ్లు చల్లిస్తున్నారు. భక్తుల కోసం టెంట్లు, నీటి వసతి కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జాతర ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో గతంలో కంటే మరింత మెరుగ్గా విద్యుత్, పారిశుధ్యం, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

పెద్దసంఖ్యలో భక్తులు



కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయానికి విశేష ప్రాముఖ్యత ఉంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరుంది. అందుకే చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. జాతరలో భక్తి భావం ఉట్టిపడేలా అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నారు.

– తిరునహరి కృష్ణస్వామి, అర్చకుడు

అన్ని ఏర్పాట్లు

మండలంలోని మామిడిపల్లితో పాటు నాగారంలోని కోదండ రామస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. ధర్మారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘమాస్య జాతరకు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.10 లక్షలతో ఏర్పాట్లు

సిరిసిల్ల శివారులోని మానేరు వాగులో వెలసిన గంగాభవాని, మడేలేశ్వరాలయంతో పాటు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే రామలింగేశ్వరాలయాలు తిరునాళ్లకు ముస్తాబయ్యాయి. భక్తుల దర్శనం కోసం నిర్వాహకులు సుమారు రూ.10 లక్షలతో ఏర్పాట్లు చేశారు. మానేరులో విద్యుద్దీపాలు, జనరేటర్, క్యూలైన్లు, ప్రసాదాల విక్రయంతో పాటు భక్తుల సౌకర్యార్థం చలువపందిళ్లు, తాగునీటి వసతి కల్పించారు. మూడు జాతర్లకు పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి లక్షమంది వరకు భక్తులు తరలివస్తారు. పోలీసు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఆలయాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక పూజలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

జాతరకు రండి



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మండలంలోని ధర్మారం గ్రామస్తులు బుధవారం కలిశారు. గ్రామంలో ఈనెల 9న జరగనున్న మాఘ అమావాస్య జాతర ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఇప్ప రాములు, నాయకులు వెంగల వెంకన్న, అతికం శ్రీనివాస్, గంగుల ఎల్లయ్య, అసరి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

వేములవాడ అర్బన్: గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వార్డు ప్రవాసి ఇన్‌చార్జి రేగుల రాజ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. 14వ వార్డు న్యూఅర్బన్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వావిలాల నర్సయ్య, వేల్పుల రాజు, వావిలాల సురేశ్, వావిలాల పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొగిపురుగు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లి గ్రామంలో వరిలో మొగిపురుగు నివారణపై అధికారులు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ సమక్షంలో వేములవాడ వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావంపై, మొగిపురుగు సమగ్ర సస్యరక్షణపై రైతులకు వివరించారు. జిల్లా ఏరువాక కేంద్రం, శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. వరిపొలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావంతో పాటు మొగిపురుగు ఎక్కువ ఉన్నట్లు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం. రాజేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారిని అనూష, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

వేములవాడ అర్బన్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పేర్కొంట ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆది శ్రీనివాస్ విద్యారంగ సమస్యల పరిష్కారం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'గృహజ్యోతి' వివరాలు ఇవ్వండి'

బోయినపల్లి: గృహజ్యోతి పథకంలో భాగంగా మండలంలోని సెస్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులకు సంబంధించిన వివరాలు విద్యుత్ బిల్లుల రీడర్‌కు ఇవ్వాలని సెస్ ఏఏఈ జీ. ప్రశాంత్ ఒక ప్రకటనలో కోరారు. బిల్లులు తీసే విద్యుత్ రీడర్‌కు వినియోగదారుడి ఆధార్ కార్డు నంబర్, మొబైల్ నంబర్, రేషన్ కార్డు నంబర్ ఇవ్వాలని కోరారు. ఏమైనా సందేహాలుంటే బోయినపల్లి సెస్ సేవాసదన్‌లో సంప్రదించాలని ఏఏఈ ప్రశాంత్ పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ముస్తాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మహ్మద్ నవాజ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బీఆర్‌ఎస్వీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నవాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చెవుల స్వామి, చిలువేరి ప్రశాంత్, గుణశేఖర్, అభి, సునీల్, వంశీ, శివాజీ, అజయ్ పాల్గొన్నారు.

12న ఉచిత వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని రైతుచర్చా మండలిలో ఈనెల 12న ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ తెలిపారు. కీళ్లు, నేత్ర, పిల్లలు, మహిళా వైద్యులు వైద్యశిబిరంలో పరీక్షలు చేసి మందులు ఇస్తారని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం రైతు చర్చా మండలిలో ఏర్పాట్లను పరిశీలించారు. రైతు చర్చ మండలి అధ్యక్షుడు సందుపట్ల రాజిరెడ్డి, రెడ్డి సంఘం మండల మాజీ అధ్యక్షుడు గన్న మల్లారెడ్డి, రాగుల ఎల్లారెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, గన్న బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బోయినపల్లి: మండలంలోని కోరెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ పుష్పలత బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డబ్బు మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల,డబ్బు సృజన్‌రెడ్డి, వార్డుసభ్యులు పద్మ, డబ్బు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత సహచరి రమాబాయి అంబేడ్కర్ జయంతిని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్ మాట్లాడుతూ తన భర్త చదువుకు పిడకలమ్మి పైసలు కూడబెట్టి ఇచ్చిన గొప్ప మనిషి అని కొనియాడారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, గద్దరాశి భగవంతం, చకినాల నారాయణ, దేవరాజు, పర్శ రాములు, బాల్‌రాజు, జావెద్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

బోయినపల్లి: బోయినపల్లి, బూర్గుపల్లి గ్రామాల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డిని బుధవారం రెండు గ్రామాల ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు సన్మానించారు. మాజీసర్పంచ్ లతశ్రీ, మాజీ వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

మాజీ పాలకవర్గానికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. పదవీకాలం ముగిసినా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, మాజీ సర్పంచ్ ముక్క మధుకర్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లెలు మరింత పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: పల్లెల ప్రగతి ప్రత్యేకాధికారుల పాలనలో మరింత పురోగతి సాధించాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రమాదేవి, ప్రత్యేకాధికారులు సుకన్య, ఇనాయతుల్లా, స్రవంతి, ఆరీఫ్, వంశీకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వేములవాడ : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పట్టణంలోని తెలంగాణచౌక్‌లో క్షీరాభిషేకం చేశారు. పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, సీనియర్ నాయకులు కూరగాయల కొమరయ్య, తూం మధు, చిలుక రమేశ్, నాగుల రాముగౌడ్, పాత సత్యలక్ష్మి, మహమ్మద్, సోయినేని కరుణాకర్, లింగంపల్లి కిరణ్, ఎర్ర శ్రావణ్, మహాదేవుని అంజయ్య, విజయ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



చందుర్తి : బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రాగి లడ్డూలు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి



ఎల్లారెడ్డిపేట: రాగి లడ్డూలు అందిస్తున్న అధికారులు

కోనరావుపేట: చిరుధాన్యాలతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో ఓడెల రామకృష్ణ అన్నారు. కోనరావుపేట, నిజామాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు రాగిలడ్డూలు పంపిణీ చేశారు. వీటితో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు అందుతాయన్నారు. ఎంపీటీసీ చారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగాలక్ష్మి, కనుకమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ మంచికట్ల నర్మధ, విజయలక్ష్మి, ఏఎన్ఎం, అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ–1, అంగన్‌వాడీ–2 కేంద్రాల్లో మిల్లెట్ ఫుడ్ ఫెస్టివెల్ నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు రాగి లడ్డూలు పంపిణీ చేశారు. 24వ వార్డు కౌన్సిలర్ బుర్ర లక్ష్మి, రాజీవ్‌నగర్ హైస్కూల్ హెచ్ఎం విష్ణు, కృష్ణప్రసాద్, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో చిన్నారులకు రాగి లడ్డూలను ఎంపీడీవో చిరంజీవి చేతుల మీదుగా అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోతె సరిత, ఎంపీటీసీ అపేరా సుల్తానా, మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్, అంగన్‌వాడీ టీచర్లు తాళ్లపల్లి రేణుక, మోతె లక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.

వేములవాడ అర్బన్: పట్టణంలోని సాయినగర్‌లో మిల్లెట్ ఫుడ్‌పై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్ పుష్పలత అవగాహన కల్పించారు. అనంతరం వారికి రాగి లడ్డూలు పంపిణీ చేశారు.

చందుర్తి : బండపల్లి అంగన్ వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు రాగి లడ్డూలను తహసీల్దార్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని ఎదురుగట్లలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పూర్వ ప్రాథమిక విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు రాగి లడ్డూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎల్లయ్య మాట్లాడారు. ప్రత్యేకాధికారి లీలారాణి, అదనపు సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ నిర్మలాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, అంగన్‌వాడీ టీచరు పాల్గొన్నారు.

రుద్రంగి: గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీలతో కలిసి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య రాగి లడ్డూలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె గ్రామాల్లో రాగి లడ్డూల పంపిణీని ఎంపీటీసీ బైరినేని రాము ప్రారంభించారు. స్పెషల్ అధికారి మహేశ్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచ ర్లు, ఆశావర్కర్లు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని గర్జనపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక పోషన్ అభియాన్ కార్యక్రమాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక నిర్వహించారు. వీర్నపల్లిలో ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్, గర్జనపల్లిలో మండల వైస్ ఎంపీపీ ఇసంపల్లి హేమ, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్నాక్స్ అందజేస్తున్న కోడి అంతయ్య

తంగళ్లపల్లి: పదో తరగతిలో విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. స్టడీ అవర్ స్నాక్స్‌కోసం రూ.5 వేలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జనగామ నాంపల్లి, అధ్యక్షుడిగా జనగామ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జొన్నకంటి నాగరాజు, కోశాధికారిగా జనకంటి దుర్గయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జనకంటి రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సభ్యులు అంజయ్య, దుర్గయ్య, రమేశ్, తిరుపతి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

జాతర పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మి కేశవ పెరుమాండ్ల–ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే మాఘ అమావాస్య జాతర ఏర్పాట్ల పనులను గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో చిరంజీవి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. శుక్రవారం నుంచి జాతర జరుగనుండగా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూచించారు. ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, అనసూయ, ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట శివారులో గల మదర్ షా వలీ దర్గావద్ద మండలకేంద్రానికి చెందిన రైతులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా వద్ద పారే నీటిని పంటపొల్లాలో చల్లితే పంటలు బాగుపండుతాయని రైతుల నమ్మకం. అనంతరం అక్కడి నీటిని తీసుకెళ్లారు. రైతు చర్చామండలి అధ్యక్షుడు సందుపట్ల రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కోనరావుపేట: మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడిగా పల్లం లింగయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎల్లె రవీందర్‌రెడ్డి, బుర్ర భూమయ్య, ప్రధాన కార్యదర్శులుగా మాలోత్ గంగారాం, జిన్న రామయ్య, దుంపెట కుమార్, సహాయకార్యదర్శిగా కుమ్మరి దిలీప్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా సనుగుల తిరుపతి, సిర్ర నర్సయ్య, గంట కొమురయ్య, కర్నాల భూమయ్య, ఖలీల్, ముఖ్య సలహాదారులుగా రాపెల్లి గణేశ్, బొల్లం సత్యనారాయణ, దొంతుల అంజలి, బొల్లె రాజయ్య, తదితరులు ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

రుద్రంగి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. సైబర్ జాగృత్తా దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు. గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్రం గంగ నర్సయ్య, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో వీధులు శుభ్రం చేస్తున్న నాయకులు, అధికారులు



చందుర్తిలో ..

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం పారిశుధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువలు, నీటి నిల్వలు పరిశీలించి రోడ్లు శుభ్రం చేశారు. అల్మాస్‌పూర్‌లో ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈనెల 15 వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ రాంచందర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్పెషల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ పారిశుధ్యంపై అధికారులతో సన్నాహక సమాశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్నిగ్రామాల్లో వారం రోజులపాటు పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి నరేశ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. వీధుల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు తిరుగి సమస్యలు గుర్తించారు.

రుద్రంగి: పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంపీడీవో, రుద్రంగి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి మాలోతు శంకర్ పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : ఈనెల 15 వరకు పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో పత్తి రవీందర్ కోరారు. పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు.